క్లుప్తంగా

తక్కువ వడ్డీకే రుణాలు



వృద్ధాశ్రమానికి నిత్యావసర సరుకులు అందిస్తున్న అధికారులు, సిబ్బంది

ఏలూరు (టూటౌన్) : బ్యాంక్ ఆఫ్ బరోడా ఆధ్వర్యంలో అతి తక్కువ వడ్డీ రేట్లకే వ్యవసాయ, గృహ, వ్యాపార రుణాలు అందజేస్తున్నట్టు బ్యాంక్ చీఫ్ మేనేజర్ బి.విల్సన్ పాల్ అన్నారు. బ్యాంక్ ఆఫ్ బరోడా 117వ వార్షికోత్సవం సందర్భంగా స్థానిక మెయిన్ బ్రాంచ్ లో వార్షికోత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలోని వృద్ధాశ్రమం, వికలాంగుల ఆశ్రమాలకు నిత్యావసర సరుకులను అందజేశారు. విల్సన్ పాల్ మాట్లాడుతూ ఖాతాదారులకు సేవలందించడంలో తమ బ్యాంకు ముందు వరుసలో ఉందన్నారు. సామాజిక బాధ్యతగా తమ బ్యాంకు ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో సీనియర్ మేనేజర్ ఎస్ గుణఫణీంద్ర, బ్రాంచి మేనేజర్ కె.ప్రవీణ్ కుమార్, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ముంపు మండలాల్లో సీపీఐ కార్యదర్శి పర్యటన

ఏలూరు (టూటౌన్) : భారీ వర్షాలతో గోదావరికి వరద నీరు పోటెత్తి వాగులు పొంగడం వల్ల గుమ్మడిపల్లి పెద్దవాగు ప్రాజెక్టు గట్టు తెగి ఏలూరు జిల్లా వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లోని అనేక గ్రామాలు ముంపునకు గురైనట్టు సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య తెలిపారు. ముంపు మండలాల్లో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగ ప్రభాకర్ తదితరులు ఆదివారం పర్యటించనున్నట్టు పేర్కొన్నారు.

ఇంటింటా కుష్టు వ్యాధి గుర్తింపు సర్వే

గణపవరం: కుష్టు వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని గణపవరం మండలం పిప్పర పీహెచ్‌సీ వైద్యాధికారిణి కె.ప్రియాంక అన్నారు. శనివారం పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో లెప్రసీ డిటెక్షన్ సర్వే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏ ఒక్క ఇంటినీ వదలకుండా ప్రతి ఒక్కరికీ కుష్టు నిర్ధారణ పరీక్ష చేయాలని సూచించారు. స్పర్శలేని మచ్చలు, రాగి రంగులో మచ్చలు, ఒకటి లేదా ఐదు మచ్చలు ఉంటే వెంటనే వైద్యాధికారి వద్దకు పంపాలని సూచించారు. సీహెచ్‌ఓ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈ సర్వే ఆగస్టు 2వ తేదీ వరకూ కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సహాయకుడు నామాలరాజు, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

బాల్యంపై పుస్తకాల భారం

- బరువుల నియంత్రణపై ప్రత్యేక జీఓ
- అమలు కాని ఎన్‌సీఈఆర్‌టీ సూచనలు
- ఏలూరు నియోజకవర్గంలో 30,799 మంది పాఠశాల విద్యార్థులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : చాలా దేశాల్లో బాల్యం ఆనందోత్సాహాల మధ్య గడుస్తుందని కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి. పాఠశాలల విద్యార్థులు ఇంటి నుంచి పుస్తకాలు వగైరా విద్యా విషయక వస్తువులు తీసుకెళ్లాల్సిన అవసరం లేకుండా అక్కడి ప్రభుత్వాలు, పాఠశాలలే అన్నీ సమకూరుస్తుంటాయని చదువుతుంటాం. అయితే మన దేశంలో నష్టాల్లేని వ్యాపారాల్లో విద్య కూడా ఒకటిగా చలామణి అవుతోంది. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఒకటి నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థులకు పాఠశాల విద్య శిక్షణలా కాకుండా శిక్షలా పరిణమిస్తోంది. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులకు పుస్తకాల సంచి భారంగా మారుతోంది. ఈ పరిస్థితి నివారణకు కేంద్ర ప్రభుత్వం జాతీయ విద్యా పరిశోధన శిక్షణ మండలి (ఎన్సీఈఆర్టీ) చేసిన సూచనలు ఎక్కడా అమలు కావడం లేదు. ఏటా పుస్తకాల సంచిలో బరువు పెరగడమే తప్ప తగ్గడం లేదు. విద్యార్థి తన శరీర బరువులో రెండో వంతు మోయడం అనారోగ్య సమస్యలను తెచ్చిపెడుతోంది. ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచి విద్యార్థుల్లో పుస్తకాల సంచి పరిమాణాన్ని తగ్గిస్తూ రాష్ట్రాలకు కేంద్రం సూచనలు చేసింది.

రెండు, మూడు పుస్తకాలే ఉండాలి

వాస్తవానికి ఒకటి, రెండు తరగతులకు రెండు పుస్తకాలు (లాంగ్వేజెస్, గణితం), మూడు నుంచి ఐదో తరగతి విద్యార్థులకు మూడు పుస్తకాలు (లాంగ్వేజెస్, గణితం, ఎన్విరాన్మెంట్) ఉండాలి. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) పిల్లలపై పుస్తకాల ఒత్తిడి తగ్గించేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినయోగం చేసుకోవాలని సూచిస్తోంది. కానీ ప్రస్తుత విద్యా విధానంలో ఒకటి, రెండు తరగతుల విద్యార్థులు 8 పుస్తకాలు, తరువాత తరగతి పెరిగే కొద్దీ అధిక నోట్ బుక్స్ మోయాల్సి వస్తోంది. ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల విద్యార్థుల పరిస్థితి చెప్పనక్కర్లేదు. అధిక బరువు ఉన్న పుస్తకాల బ్యాగులు మోసుకెళ్లడం వల్ల వెన్ను, కండరాల నొప్పులకు దారితీస్తుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఈ బరువుల వల్ల శారీరక, మానసిక సమస్యలు కూడా ఏర్పడి చదువులపై ఏకాగ్రత తగ్గుతుందని వివరిస్తున్నారు.



పుస్తకాల బ్యాగులతో పాఠశాలలకు వెలుతున్న విద్యార్థినులు

ఏలూరు నియోజకవర్గంలో	
పాఠశాలలు	31
విద్యార్థులు	30,799
ప్రభుత్వ పాఠశాలలు	65
1 నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థులు	8,295
ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు	66
1 నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థులు	22,504

ఎన్సీఈఆర్‌టీ అధ్యయన అంశాలు

స్కూల్ బ్యాగ్ బరువుపై ఎన్సీఈఆర్టీ నిర్వహించిన సర్వేలో నాలుగు, ఐదు తరగతుల విద్యార్థులను పరిశీలించారు. సాధారణంగా వీరి శరీర బరువు 18 కేజీల నుంచి 22 కేజీల వరకు ఉంటుంది. ప్రభుత్వ బడుల్లో 10 నుంచి 12 కేజీలు, ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో 14 నుంచి 18 కేజీల పుస్తకాల మోత ఉంటుంది. 8 నుంచి 10వ తరగతి విద్యార్థుల శరీర బరువు 40 నుంచి 50 కేజీల వరకు ఉంటే, వారు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా భావించాలి. వారు బడికి వెళ్లేందుకు 20 నుంచి 25 కేజీల సంచిని మోయాల్సి వస్తోంది. పాఠ్యపుస్తకాలకు తోడు క్యారేజీ, తాగునీటి బాటిల్స్ తదితరాలు వీటికి అదనం. ప్రభుత్వ బడులకన్నా ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాల మోత ఎక్కువగా ఉంటోందని శిక్షణ మండలి పేర్కొంది. రాష్ట్ర సిలబస్‌తో పాటు పాఠశాలలు ప్రత్యేకంగా రూపొందించిన సిలబస్, ఐఐటీ, సీబీఎస్ఈ ఇలా వివిధ రకాల పుస్తకాలను మోయాల్సి రావడం విద్యార్థులకు తీవ్ర ఇబ్బందిగా మారుతోంది.

జీఓ 22 ఏం చెబుతోందంటే..

విద్యార్థుల స్కూల్ బ్యాగుల బరువులకు సంబంధించి 2017లో నాటి రాష్ట్ర ప్రభుత్వం జీఓ–22ను విడుదల చేసింది. దీని ప్రకారం ఏ తరగతి విద్యార్థి ఎంత బరువు బ్యాగు వినియోగించాలో వివరించింది. 1, 2 తరగతుల విద్యార్థులు 1.50 కిలోల బరువు, 3, 4, 5 తరగతుల విద్యార్థులు 2 నుంచి 3 కేజీల బరువు బ్యాగు తీసుకెళ్లవచ్చు. 6, 7 తరగతుల విద్యార్థులు 4 కేజీల బ్యాగు, 8, 9 తరగతుల విద్యార్థులు 4 నుంచి 5 కేజీల బ్యాగు, 10వ తరగతి విద్యార్థులు 5 కేజీల వరకు బరువున్న బ్యాగును తీసుకెళ్లాలి.

బాల్యానికి భారం కాకూడదు



చదువు విద్యార్థిలో చైతన్యం తీసుకురావాలి. విజ్ఞానంపై వారిలో ఆసక్తిని పెంచాలి. కానీ నేటి చదువులకు తీసుకెళ్లే పుస్తకాలు విద్యార్థులకు భారంగా మారుతున్నాయని ఎన్నో అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. దీనిపై తల్లిదండ్రులు, విద్యా సంస్థల యాజమాన్యాలు, ప్రభుత్వాలు కూడా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. పుస్తకాల బరువు కారణంగా చిన్నతనంలోనే మానసిక బలహీనత బారిన పడే ప్రమాదముంది. ఈ బరువులు ఇలానే మోస్తే భవిష్యత్‌లో వారిని వెన్నుపూస, నడుము, కండరాల నొప్పులు బాధిస్తాయి. విద్యార్థి ఆనందంగా, ఆరోగ్యంగా విద్యాభ్యాసం చేయాలంటే వారు మోసుకెళ్లే పుస్తకాల బ్యాగు బరువు తగ్గించాల్సి ఉంది.

– డాక్టర్ ఎంఎల్‌వీ ప్రసాద్, డైరెక్టర్ ఆంధ్రా హాస్పిటల్స్, ఏలూరు

జీవితం విలువ తెలుసుకోండి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నేటి యువత జీవితం విలువ తెలుసుకోవాలని సెయింట్ థెరిస్సా మహిళా కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సి అన్నారు. స్థానిక సెయింట్ థెరిస్సా స్వయం ప్రతిపత్తి మహిళా కళాశాలలో జీసస్ యూత్ ప్రో లైఫ్ మిషన్, కళాశాల ఐక్యూ ఏసీ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన అంతర్జాతీయ ప్రోలైఫ్ కాన్ఫరెన్స్‌లో సిస్టర్ మెర్సి పాల్గొని మాట్లాడారు. నేటి యువతకు జీవితం విలువలను తెలిపేందుకు ఈ కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నామని తెలిపారు. కాన్ఫరెన్స్ సమన్వయకర్త న్యూట్రిషన్ విభాగాధిపతి పి.జ్యోతి కుమారి, అంతర్జాలంలో ఇటలీ నుంచి ప్రొఫెసర్ డెన్ ఎంబ్రగియో మాట్లాడారు. విద్యార్థులు, అధ్యాపకులు, కళాశాల ప్రతినిధులు పాల్గొన్నారు.

సర్వేశ్వరరావుకు నివాళి

ఏలూరు (టూటౌన్): ఏలూరు అభివృద్ధికి, కార్మికుల అభ్యున్నతికి తమ జీవితాన్ని అంకితం చేసిన సీపీఐ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే అత్తులూరి సర్వేశ్వరరావు ఆశయాలను, ఆదర్శాలను ప్రతి కార్యకర్తా స్ఫూర్తిగా తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. అత్తులూరి సర్వేశ్వరరావు 43వ వర్ధంతిని స్థానిక వైఎంహెచ్ఏ హాలు సెంటర్లో ఏఐటీయూసీ అనుబంధ ఏలూరు పట్టణ పొగాకు కార్మికుల సంఘం ఆధ్వర్యంలో శనివారం పొగాకు కార్మికుల సంఘం నాయకులు సీహెచ్ కూర్మారావు అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో పొగాకు కార్మికుల సంఘం నాయకులు రొంపెల్ల నవీన్ కుమార్, పాలేటి సత్యనారాయణ, పసుపులేటి దుర్గారావు, తోట బాజీ, కొలుసు నాగేంద్ర, ఎస్ వెంకటేశ్వరరావు, కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

● నీలాకాశం



మూడు రోజులుగా దంచికొడుతున్న వర్షం శనివారం సాయంత్రం కాస్త విరామం ఇచ్చింది. సాయంత్రం 7 గంటల సమయంలో ఆకాశం నీలం రంగు మబ్బులతో రమణీయంగా దర్శనమిచ్చింది. ఈ ఆహ్లాదకర వాతావరణంలో ఏలూరు నగరం ప్రజలు సేదతీరారు.

– సాక్షి ఫొటో గ్రాఫర్ / ఏలూరు

తగ్గుముఖం పట్టిన వానలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా నగర జీవనాన్ని అతలాకుతలం చేసిన వర్షాలు శనివారం తగ్గుముఖం పట్టాయి. ఉదయం కుండపోతగా కురిసిన వర్షం మధ్యాహ్నం 12 గంటల నుంచి క్రమంగా తగ్గుతూ వచ్చింది. నగరంలో సాయంత్రం నుంచి రహదారులు పొడిగా మారాయి. వాన తగ్గడంతో జనజీవనం సాధారణ స్థితికి చేరుకుంది. భారీ వర్షానికి ఏలూరు కలెక్టర్ కార్యాలయం, జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం, ఆర్టీసీ కొత్త బస్టాండు తదితర కార్యాలయాల్లో వర్షపు నీరు నిలిచిపోయింది. కాగా ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు తమ్మిలేరు ప్రవాహం వేగం కావడంతో పాటు నగరంలోని వివిధ ప్రాంతాల గుండా ప్రవహించిన తమ్మిలేరు వరద నీటి మట్టం క్రమంగా పెరిగింది. తంగెళ్లమూడి వద్ద నీటి ప్రవాహం ఉధృతంగా కనిపించింది. కొత్త బస్టాండు వద్ద తమ్మిలేరులో నీటి ప్రవాహానికి అడ్డంకిగా ఉన్న గుర్రపుడెక్కను అధికారులు జేసీబీ సాయంతో తొలగించారు.

కొల్లేరుకు జలకళ

ఏలూరు రూరల్: తమ్మిలేరు ఉప్పొంగడంతో కొల్లేరుకు జలకళ వచ్చింది. భారీ వర్షాలకు తమ్మిలేరు ఉరకలేస్తోంది. శనివారం ఎగువ ప్రాంతం నుంచి వచ్చిన వరద నీరు ఇరిగేషన్ అధికారులు ఏలూరు తూర్పు, పడమట లాకుల మీదగా కొల్లేరులోకి విడుదల చేశారు. కృష్ణ జిల్లాలో కురిసిన వర్షపునీరు సైతం బుడమేరు మీదుగా సరస్సులోనికి చేరుతోంది. ఫలితంగా కొల్లేరు సరస్సు నిండుకుండాలా మారుతోంది. ఏలూరు నుంచి పారుతున్న వరద నీటితో కొల్లేరులో మొండికోడు డ్రెయిన్ గుండా గుడివాకలంక, పెదయాగనమిల్లి, కోమటిలంక మీదుగా కిందికి పారుతోంది. గుడివాకలంక నుంచి పెదయాగనమిల్లి డ్రెయిన్ పొంగుతోంది. ఇరు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. కోమటిలంక ప్రధాన రోడ్డు కింద నుంచి వరదనీరు ఉధృతంగా పారడంతో గ్రామ ప్రజలు అప్రమత్తమయ్యారు. కొల్లేరుకు వరదనీరు పారడంతో రానున్న రోజుల్లో చేపల చెరువులకు నీరు పుష్కలంగా అందుతుందని గుడివాకలంక, ప్రత్తికోళ్లలంక, పైడిచింతపాడు, చెట్టున్నపాడు, కొక్కిరాయిలంక, కోమటిలంక తదితర గ్రామాల్లో చేపల సాగుదారులు భావిస్తున్నారు.

కాలనీలు బురదమయం

ఏకదాటిగా కురుస్తోన్న వర్షాలకు కొల్లేరు గ్రామాల్లో పలు ప్రాంతాలు బురదమయంగా మారాయి. గుడివాకలంక చర్చి కాలనీ రోడ్లు చిత్తడిగా మారాయి. శ్రీపర్రు బీసీకాలనీ, చాటపర్రు చంద్రబాబు నాయుడు కాలనీ, ప్రత్తికోళ్లలంక బీసీకాలనీలో పలు రోడ్లు బురదమయమయ్యాయి.



తంగెళ్లమూడి వంతెన వద్ద కొల్లేరులోకి పరుగులు తీస్తున్న తమ్మిలేరు



కలెక్టరేట్‌లో చేరిన వర్షపునీరు



వర్షంలో గొడుగు సాయంతో వెళ్తున్న ప్రజలు



ఏలూరు పడమట లాకులు నుంచి కొల్లేరు వైపు పారుతున్న వరదనీరు



కొత్తబస్టాండ్‌లో చేరిన వర్షపు నీరు

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	19
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	18
ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	17
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	35

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.45	4820	16
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.15	4822	24
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	22
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	18
ఏలూరు - జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	28
ఏలూరు - జీడిమెట్ల వయా ఖమ్మం	21.00	4804	19
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	18
ఏలూరు - తిరుపతి	16.00	4830	21

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	56	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	38	చిక్కుడు కాయలు	74
వంకాయలు (కాంతులు)	36	చామదుంపలు	48
వంకాయలు (తెలుపు)	34	ములక్కాడలు	10,12
బెండకాయలు	30	కంద	60
పచ్చిమిర్చి	52	బీట్‌రూట్	34
కాకర కాయలు	44-56	కీరా దోస	48
బీరకాయలు	30	ఫ్రెంచ్‌బీన్స్	64
బీరకాయలు (పందిరి)	36	అల్లం	100-170
క్యాబేజీ	40	కొత్తిమీర (కట్ట)	15-20
క్యారెట్	34-54	పాలకూర	12
దొండకాయలు	32	చుక్కకూర	12
బంగాళదుంపలు	40	తోటకూర	10
ఉల్లిపాయలు	40	గోంగూర	07
గోరుచిక్కుడు	48	పుదీనా	05
దోసకాయలు	20	బఠాణి	--
ఆనబకాయ (1)	15-20	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	48

పశుపోషకులు జాగ్రత్తలు పాటించాలి



మాట్లాడుతున్న డైరెక్టర్ గోవింద్

దెందులూరు: వ్యవసాయం తరువాత అంతటి ప్రాధాన్యం ఉన్న రంగం పాడి పరిశ్రమేనని పశు సంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ గోవింద్ అన్నారు. శనివారం గోపన్నపాలెం పశుసంవర్ధకశాఖ డిప్యూటీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రైతులు వ్యవసాయంతో పాటు పశువులు, గొర్రెలు, మేకలతో పాటు కోళ్ల పెంపకానికి ఆసక్తి చూపుతున్నారన్నారు. వ్యవసాయంలో ఇబ్బంది తలెత్తినా, పాడి పరిశ్రమ ద్వారా రైతు గట్టెక్కుతాడన్నారు. మూగజీవాల పెంపకంపై అవగాహన లేక కొన్నిసార్లు వాటిని కోల్పోవాల్సి వస్తుందని, పశువైద్యులు, శాస్త్రవేత్తల సలహాలు పాటించి వర్షాకాలం పశువులకు సోకే వ్యాధులు, చికిత్స పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. వర్షాకాలంలో గిట్టల చీలు్, నోటి గుబ్బలు, పొదుగు వాపు, గోమార్లు సోకుతాయన్నారు. పశువులు తీవ్ర అనారోగ్యానికి గురవుతాయన్నారు. సకాలంలో ఈ వ్యాధులను గుర్తించి తగువైద్యం చేయించడం ద్వారా పశువులను కాపాడుకోవచ్చన్నారు. వర్షపు నీటితో నేల చిత్తడిగా మారడం వల్ల పలు రకాల వైరస్‌లు పశువుల శరీరంలోకి ప్రవేశిస్తాయన్నారు. పశువుల పాకతోపాటు వాటిని ఉంచే ప్రదేశాల నేల పొడిగా ఉండేట్లు చూసుకోవాలన్నారు. పశువుల పాక పైకప్పు వర్షాకాలంలో కారకుండా జాగ్రత్తపడాలని సూచించారు. షెడ్లల్లో నీరు కారడం వల్ల బురద, చిత్తడి ఎక్కువై పశువులు ఇబ్బంది పడతాయని అన్నారు. గాలి సరిగ్గా తగలకపోవడం వల్ల అమ్మోనియా వాయువు విడుదలై పశువులకు కంటి నుంచి నీరు కారుతుందన్నారు. రైతులు, పశుపోషకులు ఈ సమస్యలు గుర్తించి జాగ్రత్తగా ఉండాలన్నారు. తడిసిన వరిగడ్డి, వేరుశెనగ, కొర్రగడ్డికి బూజు పడుతుంది. వివిధ రకాల వైరస్‌లు వ్యాపిస్తాయి. అలాంటి గడ్డి పశువులు తినడం వల్ల రోగాలు తొందరగా సోకుతాయి. వర్షాకాలంలో వట్టి గడ్డి తడవకుండా చర్యలు తీసుకోవాలి. పచ్చిగడ్డితో మేపిన పశువులకు కడుపు త్వరగా నిండి త్వరగా ఆరుగుతుంది. ఎండుగడ్డిని కూడా పశువులకు అందించాలి.

కుదేలైన రైతులను ఆదుకోవాలి



పూళ్లలో ముంపు చేలను చూపిస్తున్న జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు

భీమడోలు: అకాల వర్షాలకు కుదేలైన రైతాంగాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మండలంలోని పూళ్ల పంచాయతీ పరిధిలోని పూళ్ల, ఎంఎంపురంలో భారీ వర్షాలకు ముంపుబారిన పడిన పంట చేలను శనివారం రైతు సంఘం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఎకరాకు వరి నాట్లకు రూ.15వేల వరకు రైతులు పెట్టుబడి పెట్టారని, పైరు కుళ్లిపోయి తీవ్ర నష్టాన్ని చవిచూశారన్నారు. పంటలకు జరిగిన నష్టాలను అంచనా వేసి కౌలు రైతులకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరారు. జిల్లా కన్వీనర్ కె.అప్పారావు, జిల్లా కోకన్వీనర్ వి.రామచంద్రమూర్తి, పలువురు కౌలు రైతులు పాల్గొన్నారు.